క్లుప్తంగా

మైనార్టీ గురుకుల పాఠశాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను బుధవారం ఎంపీడీవో నరేశ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. లేదా అని విద్యార్థుల ద్వారా ఆరా తీశారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతగా ఉండాలని, వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రిన్సిపాల్ వెంకట్రాములు, సాయిలు, సిబ్బంది ఉన్నారు.

ఎల్లారెడ్డిలో వాహనాలు..

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు.

ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



నాగిరెడ్డిపేట: గోపాల్‌పేటలో ఉగాది ఉత్సవాలలో భాగంగా చేపట్టనున్న ఎడ్లబండ్ల ప్రదర్శన దారిని బుధవారం స్థానిక ఎస్సై మల్లారెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఇటీవల గ్రామంలో జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా నూతనంగా సర్వీసు రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎడ్లబండ్ల ప్రదర్శనకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులతో ఆయన పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి తదితరులున్నారు.

స్వయంపాలన దినోత్సవం



నాగిరెడ్డిపేట: మండలంలోని గోలిలింగాల, తాటిచెట్టు గడ్డతాండా ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. కార్యక్రమంలో భరత్, ధనుష్, కావ్య, ఆంజనేయులు తదితరులున్నారు.

వర్గీకరణ చేసిన తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలి

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేసిన తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో వారు నిరసన తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు పద్మారావు, శివనంది, రామచంద్రం తదితరులున్నారు.

నేడే కాముని పండుగ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం కాముని పండుగ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శివాలయం వద్ద గ్రామస్తుల సమక్షంలో ఈ మేరకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే చదువు మీద ఆసక్తి చూపాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిన్ననాటి నుంచే చదువు మీద ఆసక్తి చూపుతూ, భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సంపాదించి, మేధావుల మార్గంలో నడవాలని మోటివేటర్ సంజీవులు అన్నారు. తాడ్వాయి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అబ్దుల్ కలాం రాసిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కళ్యాణి, పుస్తకాల దాతలు శ్యాంరావు, రవీందర్‌రెడ్డి, వేణు, మాజీ సర్పంచ్ సంజీవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శ్రీరామనవమి ఉత్సవాలకు అనుమతివ్వండి'

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో వచ్చే నెల 6 నుంచి 64వ వార్షికోత్సవ సందర్భంగా శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి అవసరమైన అనుమతులివ్వాలని డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్‌ను ఉత్సవ కమిటీ ప్రతినిధులు కోరారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి చొరవతో రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.భూమేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో డీఆర్ఎంను కలిసి సన్మానించారు. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలని రైల్వే అధికారులు పూర్తి సహకారం అందిస్తారని ఆయన అన్నారు.

అస్తవ్యస్తంగా రహదారులు

- మూల మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు కరువు
- కంకర తేలి గతుకులమయంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



పిట్లం నుంచి మద్దెల చెరువు వెళ్లే మార్గంలో అటవీ ప్రాంతం వద్ద ధ్వంసమైన రోడ్డు



కుర్తి గేట్ - కుర్తి మార్గంలో కంకర తేలిన రహదారి



ప్రమాద సూచిక లేని పిట్లం - రాంపూర్ మార్గం



పిట్లం నుంచి కుర్తి గేట్ వద్ద..

పిట్లం(జుక్కల్) : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు కంకర తేలి, గుంతల మయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మారినా మండలంలో రోడ్ల పరిస్థితి మాత్రం మారడం లేదు. నిత్యం వాహనాలు తిరిగే రహదారులు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారినా పట్టించుకునే వారు లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి బాన్సువాడ రోడ్డు కుర్తి గ్రామంకు వెళ్లే రహదారి, మండలంలోని గోద్మెగాం నుంచి కంభపూర్ వెళ్లే రహదారి, మండలంలోని చిల్లర్గి, అల్లాపూర్, బుర్నపూర్, పారేడ్‌పల్లి, మార్థండ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూలమలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు లేక గతంలో చాలా మంది ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి మండలంలోని రోడ్లకు మరమ్మతులు నిర్వహించి, మూలమలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

'ఎయిడ్స్ నివారణలో అంగన్‌వాడీల పాత్ర కీలకం'



మాట్లాడుతున్న రవికుమార్

కామారెడ్డి అర్బన్ : ఎయిడ్స్ నివారణలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమైందని, ప్రతి గర్భిణీకి హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఐఈసీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక కళాభారతి స్టేడియంలో అంగన్‌వాడి టీచర్లకు ఎయిడ్స్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గర్భిణులకు హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు చేయడం ద్వారా పాజిటివ్ కేసుల్లో పుట్టబోయే బిడ్డను హెచ్ఐవీ బారి నుంచి కాపాడొచ్చని వివరించారు. మానవ అక్రమ రవాణా, మహిళా సాధికారత, సుఖవ్యాధులు, చికిత్స, సఖి సేవలు, మహిళల ఆరోగ్యం, డ్రగ్స్ నివారణ, ఎయిడ్స్ బాధితులకు సహాయం అంశాలపై వివరించారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డీపీవో పద్మజ, పర్యవేక్షకులు భాస్కరరావు, రాజేంద్ర కుమార్, విక్రమ్, రాణి, డీఆర్‌పీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేతలతో వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

బాన్సువాడ : కార్మిక సంఘాల నాయకులతో వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. బుధవారం బాన్సువాడలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతున్న ఏకైక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. గత ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు నిధులను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. వెల్ఫేర్ బోర్డులో అధికారులతో పాటు గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నాయకులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దుబాస్ రాములు, కార్మిక సంఘం నాయకులు శంకర్, గంగాధర్, రాములు, సాయిలు, అబ్రహం, నాగనాథ్, నాగమణి తదితరులు ఉన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం

- పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్



సుల్తాన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఏఎంసీ చైర్మన్

నిజాంసాగర్(జుక్కల్): పేదోడి సొంతింటి కలను ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నిజం చేస్తున్నారని పిట్లం ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ అన్నారు. బుధవారం సుల్తాన్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సహకారంతో నెరవేరుస్తామని చెప్పారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎలే. మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు గుర్రపు శ్రీనివాస్ పటేల్, బంగ్లా ప్రవీణ్, బ్యాతయ్య, బ్రహ్మం తదితరులున్నారు.

షబ్బీర్‌అలీకి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి



భిక్కనూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

భిక్కనూరు/కామారెడ్డిటౌన్ : ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని భిక్కనూరు సింగిల్ విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అందె దయాకర్ రెడ్డి, విండో డైరెక్టర్ పెద్దబచ్చగారి మహిపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దుంపల మోహన్‌రెడ్డిలు తదితరులు.. సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం భిక్కనూరులో వారు మాట్లాడారు. 45 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి ప్రజలకు సేవలు చేస్తున్న షబ్బీర్‌అలీకి ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉండే షబ్బీర్‌అలీకి మంత్రి పదవిని ఇస్తే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. షబ్బీర్‌అలీకి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని వారు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లకు ఫాక్స్ ద్వారా కోరారు. షబ్బీర్ అలీకి మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్ రెడ్డి అధిష్టానాన్ని కోరారు.

ముగ్గురికి జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు



జ్ఞానేశ్వర్



విశ్వజిత్



సంభాజీ

మద్నూర్(జుక్కల్): మండలానికి చెందిన ముగ్గురు యువకులు.. జూనియర్ లెక్చరర్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మండలంలోని ఖరగ్ గ్రామానికి చెందిన డాంగే జ్ఞానేశ్వర్‌కు నారాయణ ఖేడ్‌లో, మద్నూర్‌లోని ఇందిరానగర్‌కు చెందిన కాంబ్లే విశ్వజీత్‌కు మద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, గోజేగావ్‌కు చెందిన సంభాజీకి గాంధారీ జూనియర్ కళాశాలలో బుధవారం పోస్టింగ్ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. వీరు ముగ్గురు హిందీ జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికయ్యారు. లెక్చరర్ ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు వారిని అభినందించారు.

అర్థమెటిక్, రీజనింగ్‌పై పట్టు సాధించాలి



కామారెడ్డి అర్బన్ : పోటీ పరీక్షలు అర్థమెటిక్, రీజనింగ్ అంశాలపై ఆధారపడి ఉంటాయని, ప్రతి విద్యార్థి వీటిపై పట్టు సాధించాలని కామారెడి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాల టీఎస్‌కేసీ, టాస్క్ ఆధ్వర్యంలో రెండు రోజుల అర్థమెటిక్, రీజనింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. విద్యార్థులు తమ మేధాసంపత్తిని ఉపయోగించి తార్కికంగా అతి తక్కువ సమయంలో జవాబు సాధించడానికి శిక్షణ ఉపయోగపడుతుందని సమన్వయకర్త రాజ్‌గంభీర్‌రావు అన్నారు. రిసోర్స్ పర్సన్ బట్టు రఘుతేజ, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, మెంటార్ అజారుద్దీన్, ఫర్హీన్ ఫాతిమా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి క్రైం: నూతన కార్యవర్గసభ్యులు సంఘం అభివృద్ధికి కృషి చేయాలని డీపీఎం రమేశ్ బాబు అన్నారు. రాజంపేట మండల సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజంపేట మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా సుతారి లక్ష్మి(రాజంపేట, వినాయక గ్రామ సంఘం), కార్యదర్శిగా సీహెచ్ లత(తలమడ్ల), కోశాధికారిగా కె.లావణ్య(కొండాపూర్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీబీవో ఆడిటర్ రాము, సీసీలు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రికవరీ సెల్‌ఫోన్ అప్పగింత



మాచారెడ్డి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బుధవారం సీఈఐఆర్ ద్వారా రికవరీ చేసి బాధితుడికి అందజేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. పాల్వంచ మండలం భవానీపేటకు చెందిన మంద నారాయణ ఇటీవల సెల్ ఫోన్ పోగొట్టుకొని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం



పొలంబాటలో పాల్గొన్న తాడ్కోల్ రైతులు



మాల్తుమ్మెదలో..

బాన్సువాడ రూరల్: విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ గంగాధర్ అన్నారు. బుధవారం తాడ్కోల్ శివారులో పొలంబాట నిర్వహించారు. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేశారు. రైతులు విద్యుత్ సమస్యలు వస్తే అధికారులకు సమాచారం అందించాలని, సొంతంగా మరమ్మతులు చేయవద్దన్నారు. కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాన్సువాడ రూరల్ ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాల్తుమ్మెదలో ..

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెదలో ట్రాన్స్‌కో అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ శివారులోని ఎస్ఎస్7 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా లూజ్‌లైన్లకు మరమ్మతులు చేశారు. డీఈ విజయ సారథి, ఏడీ నాగేందర్‌రెడ్డి, ఏఈ నాగరాజు, లైన్‌ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్‌మన్ ఈశ్వర్ తదితరులున్నారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



పరీక్షల్లో పాల్గొన్న మత్స్యకారులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : బాయంపల్లిలో మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధికారి శ్రీపతి తెలిపారు. బుధవారం ఆయన బాయంపల్లిలో మత్స్యకారులనుద్దేశించి మాట్లాడారు. గ్రామ శివారులోని పటేల్ చెరువులో 18 మంది మత్స్యకారులకు వల విసరడం, ఈత కొట్టడం, పాండి గుంజడం పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. త్వరలో మత్స్యకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. అలాగే బీమా సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం చైర్మన్ గాదం సత్యనారాయణ, ఆడిటర్ శ్రీనివాస్, జిల్లా డైరెక్టర్ బెస్త సాయిలు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు సాయికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, సిబ్బంది అక్తర్‌అలీ, మాజీ ఎంపీటీసీ పచ్చంటి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

శ్రీహరిహర దేవి క్షేత్రంలో భూమిపూజ

బాన్సువాడ రూరల్: బుడిమి శివారులోని మంజీరా నది ఒడ్డున బుధవారం శ్రీహరి హర దేవి క్షేత్రంలో దేవాలయం నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. గురుమాదనానంద సరస్వతి పీఠాదీశ్వరులు, పరమాహంస పరివ్రాజకాచార్య శ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామపెద్దలు సంగమేశ్వర్, నాయకులు అంజిరెడ్డి, ఎర్వాల కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నర్వ రవి తదితరులు పాల్గొన్నారు.

కొలనుపాకలో ఎమ్మెల్యే పూజలు



నిజాంసాగర్(జుక్కల్): కొలనుపాక సోమేశ్వరాలయంలో శివుడికి బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్నూర్ మండలం ఎంబురా రాచన్న దేవాలయం నుంచి కొలనుపాక సోమేశ్వరాలయం వరకు రేణుకాచార్య భక్తులు పాదయాత్ర చేపట్టారు. బండాయప్ప స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర కొలనుపాకకు చేరడంతో భక్తులకు స్థానిక ఎమ్మెల్యే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తూ కొలనుపాక ఆలయంలో పూజలు చేశారు.

వీరశైవలింగాయత్‌ల ప్రత్యేక పూజలు



బాన్సువాడ : వీరశైవలింగాయత్‌ల ఆరాధ్య గురువు రేణుక చారుల చిత్ర పటానికి బుధవారం బాన్సువాడలో మహిళలు ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ మహిళా నాయకులు మహాదేవి మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్ బాధ్యులైన రేణుక చారులు మహాత్మా బసవేశ్వరుడికి ప్రేరణగా నిలిచారని అన్నారు. శైవతత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందించారని గుర్తు చేశారు. ప్రతినిధులు లత, అనిత, శ్రీదేవి, సునీత, అశ్విని, నందిని తదితరులు ఉన్నారు.

సమగ్ర వికాసానికి పరిశ్రమల శాఖ వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయ్‌కుమార్

కామారెడ్డి అర్బన్: విద్యార్థుల సమగ్ర వికాసానికి నేడు (గురువారం) కళాశాలలో 'సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలు–ఉద్యోగ అవకాశాలు' అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో వర్క్‌షాప్‌నకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ అదనపు డైరెక్టర్ రాజేశ్ కుమార్ యాదవ్, పరిశ్రమల శాఖాధికారులు లాలునాయక్, తులసీదాస్, ఎకనామిక్స్ విభాగాధిపతి, కన్వీనర్ ఎ.సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

దోమకొండ: మండల కేంద్రంలోని ముత్యంపేట రోడ్డులో బుధవారం ఆంజనేయ యూత్ క్లబ్ గణేష్ మండలి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సీ హాస్టల్ ముందు చలివేంద్రం ఏర్పాటు చేశామని, గ్రామస్తులతో పాటు వాహనదారులకు దీని వల్ల ప్రయోజనం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

నెమిలి ప్రాథమిక పాఠశాలలో వైద్య పరీక్షలు



నస్రుల్లాబాద్: నెమ్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం నర్సింగ్ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి చందర్ మాట్లాడుతూ.. మెగా హెల్త్ క్యాంపు ద్వారా బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఎంలు దుర్గాబాయ్, నర్మద, బీఎస్సీ నర్సింగ్ కాలేజ్ హెచ్‌వోడీ శ్రీదేవి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ కోసం పరిశీలన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో నంది విగ్రహం నుంచి చేపట్టనున్న డబుల్ రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా స్థలాన్ని అధికారుల సమక్షంలో పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించే ముందు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. తహసీల్దార్ గంగాసాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కంటి అద్దాల పంపిణీ



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో బుధవారం ఆర్‌బీఎస్‌కే ద్వారా విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుప్రియా మాట్లాడుతూ.. కొన్ని రోజుల క్రితం విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా.. కంటి నుంచి నీరు కారటం, తలనొప్పి ఇతర సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. ప్రతి నెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి తగిన సూచనలు, మందులు అందిస్తున్నామని తెలిపారు.

కేజీబీవీ విద్యార్థులకు..

కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని టేక్రియాల్ కేజీబీవీలో కంటి చూపు మందగించిన విద్యార్థులకు బుధవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యులు సంతోష్, మమత, కేజీబీవీ ప్రత్యేకాధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు బుధవారం స్థానిక చర్చి పాస్టర్ కరుణాకర్ పరీక్షా ప్యాడ్లను పంపిణీ చేశారు. ఆ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 46 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, రెండు పెన్నులను ఉచితంగా అందజేశారు. మహమ్మద్‌నగర్ ఎంఈవో అమర్‌సింగ్, స్థానిక ప్రధానోపాధ్యాయుడు మధుసూధన్ రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



లింగంపేట(ఎల్లారెడ్డి): కొయ్యగుండు తండాకు చెందిన కేతావత్ అంజికి బీమా చెక్కును బుధవారం జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జీఎం లింబాద్రి అందజేశారు. కేతావత్ కిషన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యుడుగా ఉండి ఇటీవల మృతి చెందడంతో రూ.లక్ష బీమా మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడి భార్య అంజికి చెక్కు అందజేసినట్లు తెలిపారు. చైర్మన్ దేవేందర్ రెడ్డి, సీఈవోలు పెంటయ్య, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): నందివాడలో బుధవారం బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ చెక్కులను అందజేశారు. పార్టీ అధికార ప్రతినిధి షౌకత్‌అలీ, నాయకులు గంగారెడ్డి, రాజలింగం, స్వామి గౌడ్, నరేందర్‌రెడ్డి, వేణు, గణేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.